



గిర్మాజీపేట: ఎస్2 గ్రౌండ్‌లోకి బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలు, బతుకమ్మలతో తరలివస్తున్న కాశీబుగ్గ సొసైటీ కాలనీకి చెందిన మహిళలు, మధ్యకోటలో ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ బైరబోయిన ఉమ

# పూల జాతర

- కోలాహలంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- నియోజకవర్గవ్యాప్తంగా ఆడిపాడిన ఆడబిడ్డలు
- బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికిన మహిళలు

నమస్తే నెట్‌వర్క్: తెలంగాణ ఐకాన్ బతుకమ్మ.. సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు సాక్ష్యం.. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై.. చివరిరోజు సద్దుల బతుకమ్మకు సద్ది కట్టి సాగనంపే వరకూ మహిళలు గౌరమ్మను ఆటపాటలతో అర్చించి.. సేవించారు. పల్లె పట్నం అనే తేడా లేకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా నీళ్లలతో కలకలలాడుతున్న చెరువులన్నీ పూల పరిమళాలతో పరవశించి పోయాయి. తంగేడు, గునుగు, పట్టుకుచ్చు, కట్లపూలు, మందారాలు, గన్నేరు, గుమ్మడి, రుద్రాక్ష, గోరింట ఇలా తీరొక్క పూలతో మమతానురాగాల బతుకమ్మను పేర్చిన ఆడబిడ్డలు ఆనక సద్దులను తయారు చేశారు. అందంగా పేర్చిన పూల గోపురాలు.. మధ్యలో పసుపుతో చేసిన గౌరమ్మను ప్రతిష్ఠించిన మహిళలు ముస్తాబై ఆదివారం బతుకమ్మలు, సద్దులను చేతపట్టుకొని చెరువుల వద్దకు వెళ్లిన తీరు మహాద్భుతం. 'రామ రామ ఉయ్యాలో.. శ్రీరామ ఓరామ ఉయ్యాలో అంటూ ఊయల ఆటలు, కోలోయమ్మ కోలో మాయమ్మ' అంటూ బతుకమ్మ ఘనతను చాటుతూ పాడిన పాటలు తెలంగాణ సంస్కృతిక సౌరభాలు గుభాళించాయి. ధూపదీప సుగంధ ద్రవ్యాల సువాసనలతో చెరువులన్నీ సందడిగా మారాయి. ఖిలావరంగల్



చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరీమాబాద్: బతుకమ్మలతో తరలివెళ్తున్న మహిళలు

మెట్టు దర్వాజ, మధ్యకోట ఖుష్‌మహల్ ప్రాంగణం, తూర్పు కోట పెద్దమ్మ ఆలయం, శివనగర్‌లోని 34, 35 డివిజన్లతో పాటు విలీన గ్రామాలైన ఆదర్శనగర్, స్తంభంపల్లి, వసంతపురం, దూపకుంట, బొల్లికుంట, రామకృష్ణపురంలో మహిళలు రాత్రి పొద్దుపోయే వరకు బతుకమ్మ ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం వెంట తెచ్చుకున్న సద్దులను అమ్మవారికి నైవేద్యం పెట్టి  గంగలోకి సాగనంపారు. ముత్తయిదవులు వాయినాలు ఇచ్చుకున్నారు.

**అంబరాన్నంటేలా..**

వరంగల్ తూర్పు నియోజకవర్గం ఆదివారం పూలవనమైంది. ఎటుచూసినా తీరొక్క పూలతో పేర్చిన అందమైన బతుకమ్మలు దర్శనమిచ్చాయి. ఇందులో భాగంగా ఉర్సు రంగలీలా మైదానంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వరంగల్‌లో గ్రేటర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. 41వ డివిజన్ మెట్టుదర్వాజ వద్ద రాణిరుద్రమదేవి బతుకమ్మ ఆటస్థలంలో మహిళలు బతుకమ్మలతో సందడి చేశారు. 43వ డివిజన్‌లోని బెస్తం చెరువు వద్ద వేడుకలు నిర్వహించారు. 27వ డివిజన్ పరిధిలోని గోవిందరాజస్వామి ఆలయం ఆవరణ, 36వ డివిజన్ పరిధిలోని మహేశ్వరి(మైసమ్మ) ఆలయ ఆవరణలో మహిళలు బతుకమ్మ ఆడారు. పోయిరావమ్మా బతుకమ్మ.. మల్లచ్చే యేటికి మళ్లీ రావమ్మా.. అంటూ పాటలు పాడుతూ చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. 20వ డివిజన్ పద్మనగర్ సమీపంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కాశీబుగ్గ, ఎల్‌బీనగర్, గిర్మాజిపేట, ఎనుమాముల, ఎస్‌ఆర్‌నగర్, సుందరయ్యనగర్, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో తరలివచ్చారు. ఆటపాటలు, డీజే సౌండ్స్‌తో కోలాటం ఆడి ఆకట్టుకున్నారు. దీంతో చిన్నవడ్డేపల్లి చెరువు, మార్కెట్ రోడ్డు మహిళలతో కిటకిటలాడింది. అలాగే, కాశీబుగ్గ సొసైటీ కాలనీ, ఓసిటీ పార్కు, ఓసిటీ క్లబ్ హౌస్, కోటి లింగాలరోడ్డు దుస్సకుంటలో ఆడబిడ్డలు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఆడారు. అంతేకాకుండా స్టేషన్‌రోడ్‌లోని ఎస్2 గ్రౌండ్, మహేశ్వరి గార్డెన్, శ్రీరామలింగేశ్వర ఆలయం ఆవరణ, సాయినగర్‌కాలనీ, బృందావన్‌కాలనీలో కోలాటాల మధ్య మహిళలు బతుకమ్మ ఆటలు ఆడుకున్నారు.

**వేడుకలకు హాజరైన నన్నపునేని, సుధారాణి**

దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల మధ్య తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలు జట్లుగా ఏర్పడి ఒక్కేసి పువ్వేసి చందమామా.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆడిపాడారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు.



మధ్యకోటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద చిన్నారులను పలకరిస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



ఉర్సు రంగలీలా మైదానానికి బతుకమ్మలతో పెద్ద ఎత్తున తరలివస్తున్న ఆడబిడ్డలు



## శంకరమఠంలో దుర్గాసూక్త హోమం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 22: శ్రీనివాసకాలనీలోని శృంగేరి శంకరమఠంలో ఆదివారం దుర్గాసూక్త హోమం నిర్వహించారు. ప్రధానార్చకుడు సంగమేశ్వరజోషి ఆధ్వర్యంలో అర్చకులు సోమశేఖరశర్మ, సాయిగణేశ్ శర్మ, విశాల్‌శర్మ, వివేక్‌శర్మ గోపూజ, శారదాంబ అమ్మవారు, శక్తిగణపతి, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాసూక్త హోమాన్ని దీపక్ చైతన్య-లలితాకుమారి దంపతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు దంపతులు, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి డాక్టర్ సీతమహాలక్ష్మి శారదాంబను దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ మేయర్ దంపతులు

## చర్చిలో ఎమ్మెల్యే నన్నపునేని ప్రార్థనలు

కాశీబుగ్గ, అక్టోబర్ 22: వరంగల్ 18వ డివిజన్‌లోని చర్చిలో ఆదివారం తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లేబర్‌కాలనీలోని వంద ఫీట్లరోడ్డులోని హోసన్న మందిరం, క్రిస్టియన్‌కాలనీలోని యేసుకృప బాప్టిస్ట్ చర్చి, గాంధీనగర్‌లోని ఐపీసీ చర్చి, పాస్టర్ ఎలియా చర్చి, పాస్టర్ రవిపాల్ చర్చి, హెబ్రోన్ చర్చిలో పార్థనలు చేసి పాస్టర్లు, సంఘ పెద్దల దీవేనలు పొందారు. కార్యక్రమంలో వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దీన్‌దయాళ్, వైస్ ప్రెసిడెంట్ కొమ్ము రాజు, యూత్ కోఆర్డినేటర్ సింగారం సురేశ్, పాస్టర్లు గంధం అరుణ్ జేమ్స్, డాన్యేయల్, ప్రభాకర్ పాల్గొన్నారు.



చర్చిలో పార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్